ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

ఎడిటర్: నాగేంద్ర సంపుటి : 01 । సంచిక : 257 । హైదరాబాద్ 21-12 - 2024 పేజీలు : 4 । వెల రూ.6/-




## బొగ్గు గనుల సంప్రదింపుల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర బొగ్గు, గనుల శాఖ సంప్రదింపుల సంఘం సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీ రవిచంద్ర బొగ్గు, గనుల శాఖ సంప్రదింపుల సంఘం సభ్యులుగా ఉన్నారు. అలాగే ఆయన పెట్రోలియం, సహజ వాయువు పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే.కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి అధ్యక్షతన పార్లమెంటులోని కమిటీ హాలులో జరిగిన సంప్రదింపుల సంఘం సమావేశానికి ఎంపీ వద్దిరాజు హాజరై పలు అంశాలపై చర్చించారు.



## యువతకు ఉపాధే లక్ష్యం.. రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు !

ఏపీలో మరో ప్రతిష్ఠాత్మక ఇన్నోవేషన్ యూనివర్శిటీ ఏర్పాటు కానుంది. అధునాతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వెలుగొందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో డీప్‌టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన కంపెనీలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. 2లో



# తేమ పేరుతో మోసం చేయొద్దు

## లీడింగ్ తప్పువస్తే చర్యలుంటాయి

పెనమలూరు : కృష్ణా జిల్లా గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర ఇవాళ సందర్శించారు. ఈ సందర్భంగా సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు. 2లో



## అంబేద్కర్ రచ్చ .. నిరవధికంగా వాయిదా



# మన్యంలో పవనిజం

## వానలో తడుస్తూనే కొండల్లో పర్యటన

మక్కువ మండలంలోని గిరిజన గ్రామం బాగుజోలలో రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

సాలూరు : ఒకటే మాట చెబుతున్నా: మేం మీ కోసమే పని చేస్తాం. మీకు మాట ఇచ్చి అయిదేళ్ల తర్వాత వచ్చి వెళ్లం . అధికారం లేనప్పుడు తిరిగాం. బుగ్గలు తడమటం తెలీదు, తల నిమరటం రాదు. కన్నీళ్లు తుడిచి పారిపోను. మీకు మాట ఇచ్చాను. రెండు నెలలకు ఒక సారి మన్యంలో తిరుగుతాను. కన్నీళ్లు తుడిచి పారిపోను. మీకు మాట ఇచ్చాను. రెండు నెలలకు ఒక సారి మన్యంలో తిరుగుతాను. గిరిజన బిడ్డలకు, గిరిజన యువతకు, గిరిజన పెద్దలకు గిరిజన తల్లులకు చెబుతున్నా.. వళ్లు వంచి పని చేస్తాను. అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. 2లో



# ఖర్గేను, నన్ను తోసేశారు

బీజేపీ ఎంపీలు కర్రలు చేతబట్టి
సభలోకి వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకున్నారు
అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ యత్నం
బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేద్కర్‌కు వ్యతిరేకం
లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఆగ్రహం
షా క్షమాపణ, రాజీనామాకు డిమాండ్
నన్ను నెట్టారు.. బ్యాలెన్స్ తప్పి కిందపడ్డా
రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే
దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరిక

**న్యూఢిల్లీ, డిసెంబరు 19 :**

అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని.. గురువారం పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలు అందులో భాగమేనని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు.

## డోలీ మోతలకు ఇక మన్యం దూరం : రోడ్ల నిర్మాణంతో గిరిజనుల కొత్త ప్రయాణం : పవన్ కల్యాణ్



సాలూరు : ఒకటే మాట చెబుతున్నా: మేం మీ కోసమే పని చేస్తాం. మీకు మాట ఇచ్చి అయిదేళ్ల తర్వాత వచ్చి వెళ్లం . అధికారం లేనప్పుడు తిరిగాం. బుగ్గలు తడమటం తెలీదు, తల నిమరటం రాదు. కన్నీళ్లు తుడిచి పారిపోను. మీకు మాట ఇచ్చాను. రెండు నెలలకు ఒక సారి మన్యంలో తిరుగుతాను. గిరిజన బిడ్డలకు, గిరిజన యువతకు, గిరిజన పెద్దలకు గిరిజన తల్లులకు చెబుతున్నా.. వళ్లు వంచి పని చేస్తాను. అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

వాతావరణం అనుకూలించక పోయినా%ౌ% చిరుజల్లులు తడిపేస్తున్నా.. మన్యంలో డోలీ మోతల కాలం చెల్లాలనే లక్ష్యంతో పవన్ మన్యంలో అడుగుపెట్టారు. కొండలు, గుట్టలను లెక్క చేయలేదు. సాలూరు నియోజకవర్గం, మక్కువ మండలం, పనసభద్ర పంచాయతీలో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇకపై గిరిజన గ్రామాల్లో డోలీల బాధలు ఉండకూడదు అనే లక్ష్యంతో 55 గిరిజన ప్రాంతాలను కలిపేలా రూ.36.71 కోట్ల వ్యయంతో, 39.32 కి.మీ మేర రహదారుల నిర్మాణం పునాది వేశారు. ఈ రోడ్ల నిర్మాణం పూర్తి కాగానే , 3,782 మంది గిరిజనుల డోలీ కష్టాలు తీరుతాయి.

ఔను ఇన్ని దశాబ్దాలు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న ఈ ప్రాంతాల్లో, గత 3 ఏళ్లలో దాదాపు 21 డోలి మోతలు జరిగాయి. ఇక పవన్ గిరిజనలు పడే వ్యథను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గిరిజనులతో మాట్లాడుతూ, ఏటా రూ.50కోట్ల బడ్జెట్తో మన్యంలోని రోడ్లను అనుసంధానం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. పాడేరు, రంనచోడరం. అన్ని ప్రాంతాలను అనుసంధానం చేయటానికి రూ. 350 కోట్లు తో ప్రతిపాదన తీసుకువచ్చామని వివరించారు. అన్ని పనులు చేస్తాం, మీ సహకారం కావాలి. ఈ విజయనగరం జిల్లా చూస్తుంటే, అడవుల్లో ఇంత సుందర ప్రాంతంలో పుట్టిన మీరు అదృష్టవంతులు. మిమ్మల్ని చూసి అసూయ కలిగింది. మీకు బడి కావాలి. ముందు చదువు. తరువాత భగవంతుడు గుర్తుకు వస్తాడు. అప్పుడే గుడి. నిరంతరం మీకు అందుబాటులో ఉంటాను. వర్షంలో తడుస్తున్నారు. రోడ్డులేక బాధ పడుతున్నారు. మీరు పడిన బాధను స్వయంగా తెలుసుకున్నాను. మీకోసం పని చేసే సమూహాన్ని గెలి పించారు. ఐ లవ్ యూ టూ. మీకు చెప్పినంత ఐలవ్ యూ నా బిడ్డలుకు చెప్పలేదు, అని పవన్ కళ్యాణ్ అనగానే యువత కేరింతలు కొట్టారు. అధికారం ఉన్నా లేకపోయినా మీ ప్రేమ కు రుణగ్రస్తుడిని. అందుకే భగవంతుడిని ప్రార్థించాను, . దారిలో వస్తూ కష్టాలు తీర్చే శక్తి ఇవ్వండి అని సవర పూలమాంబ తల్లిని అడిగా అని పవన్ కళ్యాణ్ అన్నారు.

## రైతు సేవా కేంద్రంలో చంద్రబాబు ధాన్యం అమ్మకాలపై ఆరా

పెనమలూరు : కృష్ణా జిల్లా గంగూరులో రైతు సేవాకేంద్రాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర ఇవాళ సందర్శించారు. ఈ సందర్భంగా సేవ కేంద్రంలో ఓ రైతుతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రైతు నుంచి ధాన్యం ఎలా సేకరిస్తారో సీఎంకు సేవాకేంద్రం సిబ్బంది చూపించారు. ధాన్యం తాను ఎలా అమ్ముతున్నది చంద్రబాబుకు రైతు ఆకునూరి సాంబశివరావు వివరించారు.

నిరుడు మీద ఈసారి పంట ఎక్కువ పండిందని రైతు వెల్లడించారు. మిషన్ కోత వల్ల రూ. 5, 6 వేలు ఎకరానికి ఈ ఏడాది కలిసి వచ్చింది అని రైతు వెల్లడించారు. దీనికి దిగుబడి పెరగడం కూడా కారణమని రైతు సాంబశివరావు తెలిపారు. గడ్డిని బయోఫ్యూయల్ ప్లాంట్ వాళ్లు తీసుకుంటే మరో రూ.5వేలు వరకూ వస్తుందని సీఎం చంద్రబాబుకు తెలిపారు. గతంలో మనుషులు కోస్తే ఎకరానికి రూ. 6వేలు కోతకు, మరో రూ. 6వేలు కుప్ప వేయడానికి అయ్యేదని తెలిపారు.తొలకానికి మరో రూ. 3 వేలు ఖర్చు అయ్యేదన్నారు. ఈ లెక్కన అన్ని కలుపుకొని మనుషల ద్వారా వ్యవసాయం చేస్తే రూ. 25వేలు దాకా ఖర్చు వచ్చేదన్నారు. ప్రస్తుతం ధాన్యం డబ్బుల్లో కోత లేదు డబ్బులు కరెక్టుగానే వస్తున్నాయని చెప్పారు. ఇప్పుడు ఉన్న వ్యవస్థ బాగానే పనిచేస్తోందన్నారు. కోత మిషన్ లు బయటనుంచి వస్తున్నాయని వివరించారు. ప్రోక్యూర్మెంట్కు షెడ్యూలింగ్ మొత్తం ఒకటిగా లేదా%ౌ% వేర్వేరుగా పంట కోత కోస్తే పార్ట్ షెడ్యూలింగ్ ఇస్తామని సీఎం చంద్రబాబుకు సేవాకేంద్రం సిబ్బంది వివరించారు.

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తేమశాతంలో సేవాకేంద్రం వద్ద ఎంత రీడింగ్ వస్తే మిల్లు వద్ద కూడా అంతే రావాలని.. కానీ దానిలో మార్పు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుకు దిగుబడి ఎంత వస్తుందో కూడా నమోదు కావాలని అధికారులకు సూచించారు. ఎవరి దగ్గరైనా బాగా పంట పండితే సాగు పద్ధతులు ఏంటో తెలుసుకోవాలని అధికారులను కోరారు.. వరి పంట వేసే రకం తినగలిగేది అయి ఉండాలని సీఎం సూచించారు. టెక్నాలజీని ఉపయోగించుకొని ఏ గ్రామంలో ఎంత ప్రోడెక్టవిటీ వచ్చింది చెప్పాలని అన్నారు.

## యువతకు ఉపాధే లక్ష్యం.. రెండు ప్రధాన సంస్థలతో కీలక ఒప్పందాలు !

ఏపీలో మరో ప్రతిష్టాత్మక ఇన్నోవేషన్ యూనివర్శిటీ ఏర్పాటు కానుంది. అధునాతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వెలుగొందుతున్న ఆంధ్రప్రదేశ్లో డీప్టెక్ ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఏపీ ప్రభుత్వం రెండు ప్రధాన కంపెనీలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు

ఫిజిక్స్ వాలా ఎడ్యుటెక్ కంపెనీ తన పరిశ్రమ భాగస్వామి అమెజాన్ వెబ్తో కలిసి ఫోకస్డ్ ఫస్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ యూనివర్శిటీ ఆఫ్ ఇన్నోవేషన్ ను ఆంధ్రప్రదేశ్లో ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. ఏపీలో ఉన్నత విద్యను ఆధునీకరించేందుకు టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ (%దీ×%)తో మరో ఒప్పందం కుదిరింది.ఈ మేరకు ఉండవల్లి నివాసంలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఏపీ ప్రభుత్వంతో ఫిజిక్స్ వాలా, టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు వేర్వేరుగా ఎంఓయూపై సంతకాలు చేశారు. రాష్ట్ర యువతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో నెం.1గా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు ఆలోచనలకు అనుగుణంగా ఈ ఒప్పందాలు జరిగాయని లోకేష్ తెలిపారు.

కాగా, రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే ఇన్నోవేషన్ వర్శిటీ అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్స్ను ఏకీకృతం చేసే దిశగా పని చేస్తుంది. పరిశోధన, విద్య, ఉపాధిలో కీలక సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుంది. హబ్- అండ్ %-% స్పోక్ మోడల్ను అనుసరించి ఇన్నోవేషన్ యూనివర్శిటీ సెంట్రల్ హబ్గా పని చేస్తుంది.

ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ వాలా ఫౌండర్ %ఉ% సిఇఓ అలఖ్ పాండే, కో ఫౌండర్ ప్రతీక్ బూబ్, పిడబ్ల్యు ఫౌండేషన్ హెడ్ విజయ్ శుక్లా, డైరక్టర్ సోన్ వీర్ సింగ్, హెడ్ ఆఫ్ ఇన్నొవేషన్స్ దినకర్ చౌదరి పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి దర్శన, వసతి కోటా విడుదల తేదీలివే..



మార్చి నెల శ్రీవాణి, ఎస్ఈడీ కోటా విడుదల తేదీలో మార్పు..

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జనవరి 10 నుంచి 19 వరకు పది రోజుల పాటు జరిగే వైకుంఠ వైకుంఠ ద్వార దర్శనాల కోసం డిసెంబర్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీవాణి టిక్కెట్లను ఆన్లైన్లో విడుదల చేయనున్నారు.అలాగే పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను డిసెంబర్ 24వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.ఈ నేపథ్యంలో మార్చి నెల శ్రీవాణి, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల కోటా విడుదల తేదీలను మార్చారు. మార్చి నెలకు సంబంధించిన శ్రీవాణి టిక్కెట్ల కోటాను డిసెంబర్ 25న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు.డిసెంబర్ 26వ తేదీ ఉదయం 11 గంటలకు మార్చి నెల ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్ల కోటాను విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమలలోని డార్మెటరీ గదుల కోటాను విడుదల చేయనున్నారు.

## అంబేద్కర్ రచ్చ .. నిరవధికంగా వాయిదా



న్యూ ఢిల్లీ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అవమాన పరిచారంటూ ఇండియా కూటమి నేతలు పార్లమెంట్ శీతాకాల సమావేశాల చివరి రోజైన శుక్రవారం పార్లమెంట్ వద్ద నిరసన చేపట్టారు. విపక్ష నేతల నిరసనకు పోటా పోటీగా ఎన్డీయే కూటమి నేతలు సైతం ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. దీంతో సభ్యుల తీరుపై అసహనం వ్యక్తం చేసిన లోక్సభ స్పీకర్ ఓంబిర్లా సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

కాగా, జమిలి ఎన్నికల బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 25న ప్రారంభమైన పార్లమెంట్ శీతాకాల సమావేశం మొదటి వారంలో పలు మార్లు వాయిదా పడింది. రాజ్యాంగం, ఫెడరలిజం, ప్రజాస్వామ్యంపై డిబేట్,బీఆర్ అంబేద్కర్పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలు, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్ఖడ్పై విపక్షాల అవిశ్వాస తీర్మానం, ప్రియాంక గాంధీ లోక్సభ అరంగేట్రం వంటి అనేక అంశాలు పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రధాన చర్చకు దారి తీశాయి.

పార్లమెంట్ సమావేశాల ప్రారంభం తొలి వారంలో గౌతమ్ అదానీపై అమెరికా వేసిన అభియోగంపై చర్చ జరగాలని డిమాండ్ చేయడంతో పాటు పలు అంశాలపై ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. చర్చకు అధికార పక్షం అంగీకరించకపోవడంతో నిరసనలకు దారి తీసింది.


ఈ సెషన్లోనే ఒక దేశం, ఒకే ఎన్నికల బిల్లుపై చర్చ జరిగింది. జమిలి ఎన్నికలపై విపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. దీంతో జమిలి ఎన్నికల కోసం లోక్సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం 31 మంది ఎంపీలతో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసింది. ఈ మేరకు తీర్మానాన్ని కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్రామ్ మేఘ్వాల్ లోక్సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల చివరి రోజు ఇవాళ జమిలి ఎన్నికల బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి లోక్ సభ పంపింది.

రాజ్యసభ లో ..

వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ నేడు ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇవాళ్టితో ముగిసినట్లయ్యింది.

# ఖర్గేను, నన్ను తోసేశారు

**బీజేపీ ఎంపీలు కర్రలు చేతబట్టి సభలోకి వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకున్నారు**
**అంబేద్కర్పై అమిత్ షా వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు బీజేపీ యత్నం**
**బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళి ఎప్పుడూ రాజ్యాంగానికి, అంబేద్కర్కు వ్యతిరేకం**
**లోక్సభలో విపక్ష నేత రాహుల్ ఆగ్రహం**
**షా క్షమాపణ, రాజీనామాకు డిమాండ్**
**నన్ను నెట్టారు.. బ్యాలెన్స్ తప్పి కిందపడ్డా**
**రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే**
**దేశవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరిక**



**న్యూఢిల్లీ, డిసెంబరు 19 :**

అంబేద్కర్పై అమిత్షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని.. గురువారం పార్లమెంటులో చోటుచేసుకున్న ఘటనలు అందులో భాగమేనని కాంగ్రెస్ ఎంపీ, లోక్సభలో విపక్షనేత రాహుల్గాంధీ ఆరోపించారు. గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు అదానీ లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైందని.. దాని పై చర్చించాలని తాము కోరామని, కానీ ఆ చర్చ జరగకుండా సమావేశాలు మొదలైనప్పటి నుంచీ బీజేపీ ఇదే పనిచేస్తోందని ఆయన ధ్వజమెత్తారు. బీజేపీ, ఆరెస్సెస్ ఆలోచనాసరళిఎప్పుడూ రాజ్యాంగం, అంబేద్కర్కు వ్యతిరేకంగా ఉంటుందని.. అందుకే ఆయన జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నాయని రాహుల్ మండిపడ్డారు. “కేంద్ర హోంమంత్రి తన వ్యాఖ్యల ద్వారా తన ఆలోచనా తీరును బయటపెట్టుకున్నారు. ఆయన క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని మేం డిమాండ్ చేశాం. కానీ ఆ రెండూ జరగలేదు. ఇవాళ వాళ్లు ఒక కొత్త గత్తరకు తెరతీశారు. మేం అంబేద్కర్ విగ్రహం నుంచి పార్లమెంటు హౌస్కు వెళ్తున్న సమయంలో.. బీజేపీ ఎంపీలు చేతుల్లో కర్రలు పట్టుకుని మెట్ల వద్ద నిలబడి, మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు”అని తెలిపారు. “నేను పార్లమెంటులోకి వెళ్తుంటే బీజేపీ ఎంపీలు నన్ను అడ్డుకుని, తోసేస్తూ బెదిరించారు” అని ఆవేదన వెలిబుచ్చారు. ఖర్గే, ప్రియాంకను కూడా తోసేశారా? అని మీడియా ప్రశ్నించగా.. “అది కూడా జరిగింది. కానీ, ఈ తోపులాటలకు మేం బెదరం”అని రాహుల్ స్పష్టంచేశారు. పార్లమెంటు మకర ద్వారాన్ని చూపుతూ.. “ఇది పార్లమెంటులోకి ప్రవేశించే ద్వారం. లోపలికి వెళ్లడానికి మాకు హక్కుంది. బీజేపీ సభ్యులు మమ్మల్ని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు” అని ఆగ్రహం వ్యక్తం చేశా రు. అంబేద్కర్ను అవమానించిన అమిత్ షా.. అందుకు క్షమాపణ చెప్పి, రాజీనామా చేసి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రధాని మన దేశాన్ని అదానీకి తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

అంబేద్కర్పై షా వ్యాఖ్యలను మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా ఖండించారు. “తాను తప్పు చేసినట్టు ఒప్పుకోవడానికి ఆయన (అమిత్ షా) నిరాకరిస్తున్నారు. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం. ఆయన్ను పదవి నుంచి తొలగించాలని ప్రధాని మోదీని కోరాం. అదీ జరగలేదు. అందుకే రాహుల్, ప్రియాంక సహా మా పార్టీ నేతలందరం నిరసన తెలిపాం. బీజేపీ ఈ అంశాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తోంది”అని ఖర్గే అన్నారు. ఆ కుట్రలో భాగంగానే బీజేపీ ఎంపీలు తమపై దాడి చేశారన్నారు. “మేమెంతో క్రమశిక్షణతో ఒక వరుసలో వస్తున్నాం. వాళ్ల(బీజేపీ) మనసులో ఏముందో నాకు తెలియదు. మకర ద్వారం వైపు వచ్చి మాకు అడ్డు తగిలారు. పార్లమెంట్ లోపలికి వెళ్లాలని మేం అనుకున్నాం. కానీ వారు తలుపుల వద్ద మమ్మల్ని ఆపేశారు. పురుష ఎంపీలు కండబలాన్ని చూపించారు. మాతో వస్తున్న మహిళా ఎంపీలను సైతం అడ్డుకున్నారు. ఉద్దేశపూర్వకంగానే మాపై దాడి చేశారు. వారు నన్ను నెట్టేసరికి నేను కిందపడిపోయా ను”అని ఖర్గే తెలిపారు. “ఇదంతా వాళ్లే చేసి.. మేమే వాళ్లను తోసేసి, వారి గాయాలకు కారణమయ్యామంటూ మాపై ఆరోపణలు చేస్తున్నారు. మమ్మల్ని చూసి హేళన చేస్తున్నారు” అన్నారు. అంబేద్కర్ను అమిత్షా అవమానించారని, దీనిపై దేశవ్యాప్త ఉద్య మం చేస్తామని తెలిపారు. “తిన్నది లేదు తాగింది లేదు.. 12 అణాల గ్లాస్ పగలగొట్టాడు”అని హైదరాబాద్లో అంటుంటారని..బీజేపీ వాళ్లు చేస్తున్నది అలాగే ఉందని ఖర్గే అన్నారు.

ఇదిలా ఉండగా.. అంబేద్కర్పై అమిత్షా వివాదాస్పద వ్యాఖ్యల వీడియోను డిలీట్ చేయాలంటూ ‘ఎక్స్’కు కేంద్రం తాఖీదునిచ్చిందని కాంగ్రెస్ ఆరోపించింది. కేంద్రం ఇలా అడుగుతోందంటూ ‘ఎక్స్’ నుంచి తమకు ఒక ఈ మెయిల్ వచ్చిందని ఆ పార్టీ సోషల్ మీడియా అండ్ డిజిటల్ ప్లాట్ఫామ్స్ చైర్పర్సన్ సుప్రియ తెలిపారు. అయితే.. ‘ఎక్స్’ ఆ వీడియోలను తొలగించలేదని ఆమె చెప్పారు.

నేనెప్పుడు తెల్లటి టీ-షర్టులే వేసుకొం టాను. పారదర్శకతకు, దృఢత్వానికి, సరళత్వానికి తెలుపు దనం ప్రతీక.. మొన్న జూన్ 19న తన 54వ పుట్టిన రోజు సందర్భంగా ఈ మాటలు చెప్పిన రాహుల్ గురువారం హఠాత్తు గా నీలిరంగు టీ-షర్టులో కనిపించి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేశారు. అంబేద్కర్కు నచ్చినది దళిత జాతికి గుర్తింపు తెచ్చినదీ నీలిరంగే. రాజ్యాం గం, అంబేద్కర్ అంశాలపై రాజకీయ రచ్చ నేపథ్యం లో రాహుల్ ఇలా నీలిరంగు టీ-షర్టుకు మారిపోవడం ప్రాధాన్యం ఉన్న పరిణామమే!

**షాను కాపాడే కుట్రలో భాగమే: ప్రియాంక**

బీజేపీ ఎంపీని రాహుల్గాంధీ తోసేశారంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు అమిత్షాను కాపాడేందుకు ఆ పార్టీ పన్నిన కుట్రగా ప్రియాంకా గాంధీ అభివర్ణించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విపక్ష ఎంపీలను పార్లమెంటులో ప్రవేశించకుండా అడ్డుకునేందుకు అధికారపార్టీ ఎంపీలు గూండాగిరీకి పాల్పడుతున్నారని ఆమె మండిపడ్డారు. బీజేపీ ఎంపీ ప్రతాపచంద్ర సారంగిని రాహుల్ తోసేశారన్న బీజేపీ ఆరోపణను ఆమె తోసిపుచ్చారు. రాహుల్.. అంబేద్కర్ చిత్రపటాన్ని పట్టుకుని ‘జై భీమ్’ అని నినదిస్తూ శాంతియుతంగా పార్లమెంటులోకి వెళ్తుండగా ఆయన్ను అడ్డుకున్నారని పేర్కొన్నారు. తన కళ్ల ముందే వారు ఖర్గేను తోసేస్తే ఆయన కింద పడిపోయారన్నారు. అంబేద్కర్పై బీజేపీ అసలు ఆలోచనలు.. అమిత్షా వ్యాఖ్యల రూపంలో బయటపడ్డాయన్నారు. “దేశానికి రాజ్యాంగాన్ని, కోట్లాది మంది దళితులు, అణగారినవర్గాల ప్రజల జీవితాలను మార్చేసిన అంబేద్కర్ను బీజేపీ తన ఆలోచనలు, చర్యలతో అవమానిస్తోంది”అని ప్రియాంక ట్వీట్ చేశారు.

## పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**వెలుగోడు డిసెంబర్ 20 (రిపబ్లిక్ న్యూస్) :**

ప్రభుత్వజూనియర్ కళాశాల పాములపాడు నందు 2024 -2025 అకాడమిక్ ఇయర్ గాను శుక్రవారం పేద విద్యార్థులఅభ్యున్నతికి ప్రథమ ,ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ను ప్రభుత్వం ఉచితంగా ప్రధానం చేసింది .ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గౌ "ఆళ్లగడ్డ హరి సర్వోత్తమ రావు ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు అధ్యాపకులు రాజు, అశోక రత్నం, రవీంద్ర, విజయ భాస్కర్, భాగ్యమ్మ, గంగరాజు, లక్ష్మణ స్వామి, రత్నప్రభ, మల్లికార్జున, మద్దిలేటి, జలాల్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించండి

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల ప్రతినిధి, డిసెంబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::**

గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిల్లోనే డెలివరీ అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల పనితీరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ చిన్నచిన్న కారణాలతో గర్భిణీ స్త్రీలను వెనక్కి పంపకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పిహెచ్సి, సిహెచ్సి లలో వైద్య సేవలు మెరుగుపడాలని కలెక్టర్ ఆదేశించారు. ఓపి సంఖ్య పెరగడంతో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. మాతృ శిశు మరణాలు సున్నా స్థాయికి చేరుకునేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలలో పౌష్టికాహారాన్ని పెంచడంతోపాటు రక్తహీనతను అధిగమిచ్చేందుకు స్త్రీ శిశు సంక్షేమ అధికారులను సమన్వయ పరచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో ఎన్టీఆర్ వైద్య సేవలు మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గుండె సంబంధిత చికిత్సలు, ఇంజక్షన్లు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాలం చెల్లిన మందులు, ఇతర వృధా పరికరాలను టెండర్లు పిలిచి వేలం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్వో వెంకటరమణ, డీసీహెచ్ఎస్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపర్డెంట్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ సదస్సులు - ప్రత్యేక అధికారి రెహమాన్



**బండి ఆత్మకూరు,డిసెంబర్ 20,( రిపబ్లిక్ న్యూస్)**

– గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని మండల ప్రత్యేక అధికారి రెహమాన్ తహసిల్దార్ పద్మావతిలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంత జూటూరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్టాత్మకంగా ఇందుకోసం ఏమైనా భూ సమస్యలుంటే రైతులు రెవెన్యూ గ్రామ సభలో వినతి పత్రాలు అందజేయాలని వారు కోరారు. భూ సమస్యలను పరిష్కరించడం కోసం ప్రభుత్వం రైతుల వద్దకే అధికారులను పంపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ పర్వీన్, వీఆర్వో నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ యలగల రామచంద్రుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు పలుచాని మహేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ గంటె పోగు బాబురావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ విజేతగా మహానంది మోడల్ స్కూల్




**మహానంది, డిసెంబర్ 20,(రిపబ్లిక్ న్యూస్):**

పర్యావరణం, జీవ వైవిధ్యం పట్ల సున్నితమైన ఆలోచనలను సమాజంలో పెంపొందించే లక్ష్యంతో విప్రో సంస్థ ప్రతి ఏటా విప్రో ఎర్తియన్ పేరుతో అందించే జాతీయ అవార్డును ఏపీ మోడల్ స్కూల్ మహానంది సొంతం చేసుకుందని ప్రిన్సిపాల్ లక్ష్మణరావు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల నుండి 1550 కి పైగా వచ్చిన ప్రాజెక్టుల నుండి తమ పాఠశాల పంపిన జీవ వైవిధ్యం ప్రాజెక్ట్ కి జాతీయ అవార్డు వరించిందని ఆయన తెలిపారు. వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు శైలజ పర్యవేక్షణ లో విద్యార్థి బృందం చేసిన కృషికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ఈ జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో మొమెంటో, సర్టిఫికెట్ లతో పాటు 50,000 రూపాయల నగదు బహుమతి, ఉచిత విమాన ప్రయాణంను పొందనున్నారు. ఈ విజయానికి పలువురు ఉన్నతాధికారులు మరియు సిబ్బంది అభినందించారు

# హెల్మెట్ ధరించడం పై అవగాహన ర్యాలీ నిర్వహించిన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్





**-ద్విచక్ర వాహనం నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.**

**-హెల్మెట్ ధరించడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఈ కార్యక్రమం.**

కర్నూల్, డిసెంబర్ 20, రిపబ్లిక్ న్యూస్ ::

శుక్రవారం హెల్మెట్ ధరించడం పై కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ లో పాల్గొన్నారు. ఈ అవగాహన ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్, కలెక్టరేట్ మీదుగా సి. క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది.

ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకే కర్నూలు ట్రాఫిక్ పోలీసులతో అవగాహన ర్యాలీ చేపట్టామన్నారు.

జాతీయ , రాష్ట్ర రోడ్డు ప్రమాదాలలో ఎక్కువగా ద్విచక్రవాహనదారులే మరణిస్తున్నారన్నారు.

బైక్ లు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వల్ల అనుకోని రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సురక్షితంగా గమ్యాలను చేరుకోవాలన్నారు.

యువత అత్యుత్సాహం తో అతివేగంగా వాహనాలను డ్రైవింగ్ చేసి రోడ్డు ప్రమాదాల బారిన పడకూడదన్నారు.

తల్లితండ్రులు తమ పిల్లలకు ట్రాఫిక్ రూల్స్ గురించి తెలియజేయాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండేలా, మొబైల్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి వెళ్ళకుండా పలు జాగ్రత్తలు చేపడితే దాదాపు రోడ్డు ప్రమాదాలను నియంత్రించవచ్చున్నారు.

ఈ అవగాహన ర్యాలీ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి. హుస్సేన్ పీరా, కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్, కర్నూలు పట్టణ సిఐలు నాగరాజారావు, శేషయ్య, చంద్రబాబునాయుడు, ఎస్సైలు, ఆర్ ఎస్సై లు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి

**పోలీస్, న్యాయశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి**

**ఫాస్ట్ ట్రాక్, ప్రత్యేక కోర్టులపై న్యాయ, హెూం మంత్రుల సమీక్ష**

**అమరావతి డిసెంబర్ 20( రిపబ్లిక్ న్యూస్) :**

రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న వివిధ రకాల కోర్టు కేసుల పరిష్కారంపై న్యాయశాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర న్యాయ, మైనారిటి సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత సూచించారు. శుక్రవారం వెలగపూడి సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టుల పనితీరు పై ముఖ్య అధికారులతో మంత్రులు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, అనిత మాట్లాడారు. కేసుల తీవ్రతను బట్టి, ఏ ఉద్దేశ్యంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టులు, ప్రత్యేక కోర్టులు పనిచేస్తున్నాయో అందుకు అనుగుణంగా ఆయా కోర్టుల్లోని కేసులు ఎక్కువ కాలం కొనసాగకుండా వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేటట్లుగా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.అవసరమైతే రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి వారి ఆదేశానుసారం సమన్వయం తో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా సంచలన కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయ పరిష్కారానికి టాస్క్ ఫోర్స్ కోర్టు, ప్రత్యేక కోర్టులు మరింత వేగంగా పనిచేయాలని సూచించడం జరిగింది. సమీక్ష సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి జి ప్రతిభా దేవి, హెూం శాఖ కార్యదర్శి తదితర ముఖ్యమైన అధికార బృందం పాల్గొన్నారు.

**23న విజయవాడలో క్రిస్మస్ తేనేటి విందు**



విజయవాడలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 23వ తేదీన ప్రభుత్వం తేనేటి విందు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. లబ్బీపేట ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్ లో సోమవారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తేనేటి విందు కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తేనేటి విందు కార్యక్రమానికి క్రైస్తవ కుటుంబ సభ్యులందరూ హాజరై విజయవంతం చేయాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు

# నంద్యాల జిల్లా వైసీపీ మహిళా అధ్యక్షురాలుగా సుజాతమ్మ : వైసీపీ శ్రేణుల హర్షం

**-పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపిన సుజాతమ్మ**

**-వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని హామీ**

**బండి ఆత్మకూరు,డిసెంబర్ 20,( రిపబ్లిక్ న్యూస్):-**



నంద్యాల జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా బండి ఆత్మకూరు గ్రామానికి చెందిన రాజం రెడ్డి సుజాతమ్మను నియమిస్తూ వైసిపి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో మండలంలోని వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం సాయంత్రం పలువురు మహిళలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిలు తనపై ఎంతో నమ్మకంతో వైసిపి జిల్లా మహిళా మహిళ అధ్యక్షురాలుగా నియమించడం పట్ల ఆమె పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీ పెద్దలు నాపై ఎంతో నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యత అప్పజెప్పారని అలాంటి వారి నమ్మకాన్ని ఏమాత్రం వమ్ము చేయకుండా పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని సుజాతమ్మ తెలిపారు. అలాగే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలపై నిరంతరం పోరాటం చేస్తూ మహిళలకు అండగా నిలుస్తానన్నారు. పార్టీ పెద్దల ఆదేశాల మేరకు వైసిపి శ్రేణులతో కలిసి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తానని ఆమె చెప్పారు. కాగా గత వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పనిచేశారన్నారు. మహిళల సాధికారత కోసం పని చేయడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం మహిళను విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం బాటిళ్లు స్వాధీనం

మహానంది, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్)

గ్రామాల్లో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి హెచ్చరించారు. మహానందిలోని పార్వతీపురం కాలనీకి చెందిన రవికుమార్ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం



దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఆయన నుంచి 22 క్వార్టర్ సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

# ఓర్వకల్లులో రూ.14వేల కోట్ల పెట్టుబడులు.. రాష్ట్ర మంత్రి టి.జి భరత్

కర్నూలు, డిసెంబర్ 20, రిపబ్లిక్ న్యూస్ :

కర్నూలు జిల్లా ఓర్వకల్లు పారిశ్రామిక పార్కులో రూ. 14 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ చెప్పారు. సెమీకండక్టర్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ మరియు ఇండియాకు చెందిన కంపెనీ సంసిద్ధత వ్యక్తం చేసిందన్నారు. అమరావతిలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కంపెనీ ప్రతినిధులు సమావేశమైనట్లు మంత్రి భరత్ తెలిపారు. రాయలసీమలోని ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ పెట్టుబడులకు ఎంతో అనుకూలమైన ప్రాంతమని సమావేశంలో పెట్టుబడిదారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. చర్చల అనంతరం ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో రూ. 14వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీ ప్రతినిధులు ముందుకొచ్చారన్నారు. జనవరి రెండవ వారంలో సీఎం చంద్రబాబు సమక్షంలో కంపెనీతో ఎంవోయూ చేసుకోనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ దూరదృష్టితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల పారిశ్రామిక అభివృద్ధిని పెంచడమే కాకుండా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ఒక్కొక్కటిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రానున్న రోజుల్లో మరెన్నో పెట్టుబడులు వస్తాయన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇది సాధ్యమవుతుందని మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఆవిష్కరణలు, పురోగతికి కేంద్రంగా కర్నూలు జిల్లా మారబోతుందని మంత్రి టి.జి భరత్ తెలిపారు.



# వన్యప్రాణుల గుర్తింపునకు అధునాతన కెమెరాలు

**- పరిధిలో 2400 కెమెరాలు**

**- బయోడైవర్సిటీ ఏసీఎఫ్ ధనరాజ్**

మహానంది,డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):

వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ సిబ్బంది కృషి చేయాలని బయోడైవర్సిటీ ఏసీఎఫ్ ధనరాజ్ తెలిపారు. మహానంది పర్యావరణ కేంద్రంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి పులుల గణన, వన్యప్రాణుల గుర్తింపుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం కల్పించారు. ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులలో మాంసాహార, శాఖాహార జాతులు ఉంటాయని అన్నారు. పాద ముద్రలు ద్వారా వన్య ప్రాణులను గుర్తించవచ్చని చెప్పారు. హైటికాస్ సంస్థ ప్రతినిధి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.%చీూ=%, కారిడార్ పరిధిలో పులుల గుర్తింపు, గణన కోసం అధునాతన కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. %చీూ=% పరిధిలో , కారిడార్ ప్రాంతాల్లో 2400 కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు అన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా వన్యప్రాణుల వివరాలను నమోదు చేయాల్సిన టెక్నాలజీపై సిబ్బందికి హైటికాస్ ప్రతినిధులు దూపాడు శ్రీధర్, శంకర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.



## పల్లకిలో విహరించిన మహానందీశ్వర దంపతులు



మహానంది, డిసెంబర్ 20, (రిపబ్లిక్ న్యూస్):

మహానందిలో శుక్రవారం రాత్రి పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని,నాగేశ్వర శర్మ, శాంతారాంభట్లై, హనుమంతశర్మ పండితులు, మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా గణపతి పూజ, అలంకార పూజలు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకిలో కొలువు చేశారు. ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.



# మందేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి





**మందపల్లి శనీశ్వర స్వామి దేవస్థాన అధికారులకు**
**ఎమ్మెల్యే సత్యానందరావు ఆదేశాలు**
**గత ప్రభుత్వ పాలనా వైఫల్యంతో ఆలయ అభివృద్ధి శూన్యంశా**
**ఆలయం రంగులు కూడా వేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.**

కొత్తపేట:

దేశంలోనే ప్రసిద్ధి గాంచిన కొత్తపేట మండల మందపల్లి శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు.దేవాలయ ఆకస్మిక తనిఖీ చేసిన అనంతరం ఎమ్మెల్యేగా అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారిగా స్వామి వారిని దర్శించుకున్నారు. అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఆలయం నిర్వహణ,వసతులు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనా వైఫల్యంతో ఆలయ అభివృద్ధి శూన్యమని ఆరోపించారు.కనీసం ఆలయానికి రంగులు కూడా వేయలేదని విమర్శించారు.రంగులు కూడా లేకపోవడంతో శోభాయమానంగా ఉండాల్సిన దేవాలయం వెలవెల పోయిందని అన్నారు.తాను అధికారంలోకి రాగానే ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని దానిలో భాగంగానే ఆలయ రంగులు,మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు.త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామని చెప్పారు.అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని,భక్తులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామన్నారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మరుగుదొడ్లు,డార్మెటరీ వంటి సౌకర్యాలు కల్పిస్తామని,దైవ క్షేత్రంగా మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే విధంగా దేవాలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.ఆలయానికి అవసరమైన విద్యుత్తు మరమ్మత్తులు,పార్కింగ్ స్థలాలు తదితర సౌకర్యాలు ఏర్పాటు అలాగే అమలాపురం - రావులపాలెం రహదారి నుంచి ఏటిగట్టు మీదుగా భక్తుల రాకపోకల కోసం రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు.భవిష్యత్తులో దీనిని రింగ్ రోడ్డు మాదిరిగా నిర్మిస్తామని తెలిపారు.మందపల్లి దేవస్థానాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టి భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారి నల్లం చక్రధరరావు,ధరణాల రామకృష్ణ,సిద్ధంశెట్టి సత్యనారాయణ,కొల్లి వీరాస్వామి, నక్క రాఘవాలు, కోవెల నాగేశ్వరరావు, సిద్ధంశెట్టి దుర్గాప్రసాద్, సాదు మహాలక్ష్మి, చింతం శ్రీరామ్, గవర బాబీ, ప్రసాద్, తొరటి వెంకటేశ్వరరావు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.